క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న అనకాపల్లి కలెక్టర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శనివారం అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేపట్టారు.

రూ.96 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి



శ్మశానవాటికలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: శ్మశానవాటికల అభివృద్ధికి అధిక శాతం నిధులు వెచ్చిస్తున్నామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 85వ వార్డు మంత్రిపాలెంలోని శ్మశాన వాటికలో రూ.96లక్షలతో ఏర్పాటు చేయనున్న అదనపు వసతులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలోని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికల అభివృద్ధి దాదాపు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జెడ్సీ సింహాచలం, వైఎస్సార్సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, సీనియర్ నాయకులు పచ్చికోరు రమణమూర్తి, సుందరపు అప్పారావు, సేనాపతి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

సబ్బవరం: ఆధునిక వ్యవసాయ విధానాలపై రైతులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అన్నారు.సబ్బవరం మండలంలోని మొగలిపురంలో శనివారం కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు సదస్సు నిర్వహించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని తగు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామపంచాయతీ సభ్యులు రమాదేవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు ప్రవాహం సాగేలా చర్యలు తీసుకోండి



ఎంపీడీవో హేమసుందర్రావుకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీరు అప్పారావు

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో తన ఇంటి నుంచి మురుగునీటిని పంచాయతీ కాలువ ద్వారా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని వలంటీర్ కూండ్రపు అప్పారావు శనివారం ఎంపీడీవో వి.హేమసుందర్రావుకు వినతిపత్రం అందజేశారు. తన ఇంటి నుంచి ప్రవహించే మురుగునీటిని పంచాయతీ కాలువకు అనుసంధానం చేస్తుండగా ఇంటి పక్కనున్న వారు అడ్డంకులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

గృహయోగం



నా పేరు పట్నాల బంగారు లక్ష్మి. వెన్నలపాలెంలో 14 ఏళ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నాం. కొంత కాలం కిందట నా భర్త అనారోగ్యంతో చనిపోయాడు. రజక వృత్తి చేసుకొంటూ ఇద్దరు పిల్లలను పోషించుకొంటున్నాను. టీడీపీ పాలనలో సొంతింటి కోసం దరఖాస్తు చేసినా ఇల్లు మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వం రాగానే ఇంటి కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేశాను. వెంటనే లక్షల విలువైన స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. జగనన్న మంజూరు చేసిన రూ.1.80 లక్షలతో పాటు రాయితీపై అందించిన మెటీరియల్‌తో ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. మా సొంతింటి కల జగనన్నతో సాకారమైంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

ఇది ఒక్క బంగారు లక్ష్మి అంతరంగం మాత్రమే కాదు.. సొంత గూడుకు నోచుకున్న వేలాది మంది పేదలు జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలని కోరుకుంటున్నారు.




ఇది కదా అభివృద్ధి



గ్రామం (లేఅవుట్) మంజూరైన ఇళ్లు

ఈ.బోనంగి-1	ఈ.బోనంగి-1	పి.బోనంగి-3
44	39	84
పరవాడ-1	పరవాడ-2	కలపాక-1
1290	88	91
తిక్కవానిపాలెం-1	తిక్కవానిపాలెం-2	
186	48	



పరవాడలో జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లు

పరవాడ: సొంత ఇల్లు ప్రతీ ఒక్కరి కల. పైసా పైసా కూడబెట్టి, ఒక్కో ఇటుక పేర్చి సొంతగూడు కట్టుకోవాలని ఆకాంక్షిస్తారు. దాని కోసం ఎంతో శ్రమిస్తారు. అయితే పేదలకు ఆ భారం లేకుండా సొంతింటిని సమకూర్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేసి పేదల కళ్లల్లో ఆనందం నింపారు. జగనన్న హౌసింగ్ కింద లేఅవుట్లు వేసి అందులో స్థలాలు కేటాయించారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు మంజూరు చేయడంతో పాటు రాయితీపై మెటీరియల్ అందించారు. దీంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

• రూ.8.89 కోట్ల ఖర్చు

మండలంలో బడుగు బలహీన వర్గాల లబ్ధిదారులకు 8 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.8.89 కోట్లు ఖర్చు చేసింది. ఇప్పటికే 446 ఇళ్లు పూర్తి చేసుకున్నారు. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న పరవాడ, వెన్నలపాలెం గ్రామాల్లో 290 ఇళ్లను ఇప్పటికే ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు.

• మౌలిక వసతులకు రూ. 36 లక్షలు

గృహ ప్రవేశాలు చేసిన పరవాడ జగనన్న కాలనీలో ముఖ ద్వారం, రోడ్లు, కాలువల వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం అదనంగా రూ.36 లక్షలు ఖర్చు చేసింది. జగనన్న కాలనీల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు, రాయితీపై ఇటుక, ఇసుం, సిమెంటు వంటి మెటీరియల్‌ను ప్రభుత్వం సమకూర్చింది. కాలనీల్లో విద్యుత్, తాగునీరు, వీధి రోడ్లు, సీసీ కాలువలు ఏర్పాటు చేస్తోంది.



జగనన్నకాలనీని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు(ఫైల్)

జగనన్న రుణం తీర్చుకోలేం



మాది విజయనగరం జిల్లా బొబ్బిలి దరి జోగంపేట. కొన్నేళ్ల కిందట కొబ్బరి బొండాలు, అరటి పండ్ల వ్యాపారం కోసం స్టీల్‌ప్లాంట్ వలస వచ్చాం. ముగ్గురు సంతానంతో సొంతిల్లు లేక పరవాడలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. చిరువ్యాపారంపై వచ్చే ఆదాయం ఇంటి అద్దె, ఇల్లు గడవడానికే సరిపోతున్నాయి. ఇంతలో జగనన్న ప్రభుత్వం రావడంతో సొంతింటికి దరఖాస్తు చేశాం. ఇల్లు మంజూరు చేయడంతో అద్దె ఇంటి అవస్థలు తప్పాయి. జగనన్న మంజూరు చేసిన ఇల్లు పూర్తి చేసుకొని గృహ ప్రవేశం చేశాం. మేము జీవించి ఉన్నంత వరకు జగనన్న వెంటే నడుస్తాం.

– అమ్మడమ్మ, పరవాడ

ఇల్లు వస్తుందనుకోలేదు



పదేళ్ల నుంచి ముత్యాలమ్మపాలెంలో ఉంటున్నాం. టీడీపీ ప్రభుత్వంలో సొంతిల్లు కోసం ప్రయత్నించినా ఇల్లు మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వం రాకతో సొంతిల్లు మంజూరు చేశారు.

ఇద్దరు సంతానంతో సొంతిట్లో సాఫీగా కాలం వెళ్లదీస్తున్నాం. నిరుపేదల పాలిట అండగా ఉంటూ నీతిగా పాలన సాగిస్తున్న జగనన్నకే నా ఓటు.

– కె.లక్ష్మి, తిక్కవానిపాలెం

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

'అల' కల్లోలం



ముత్యాలమ్మపాలెం తీరంలో ఎగసిపడుతున్న కెరటాలు

పరవాడ: బంగాళా ఖాతంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. శనివారం ఉదయం నుంచి కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఈదురుగాలులు బలంగా వీయడంతో తీర ప్రాంత మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సముద్రంపై చేపల వేట మానుకున్నారు. తీరంలో ఉన్న తెప్పలు, ఇంజిన్లు, వలలను సురక్షిత ప్రదేశాలకు చేర్చారు. మిచాంగ్ తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామని తహసీల్దారు పి.కనకారావు చెప్పారు. తుపాను ప్రభావంతో శని, ఆదివారాలు వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంపై చేపల వేటకు వెళ్లడం మానుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు.

అన్నదాత ఆందోళన

ఇదిలావుండగా బలంగా వీస్తున్న ఈదురు గాలుల ప్రభావంతో మండలంలో పలు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న అరటి, బొప్పాయి, ములగ తోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. అరటి, మునగ, బొప్పాయి తోటలు పడిపోకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్. చంద్రావతి సూచించారు.

అన్నదాత ఉరుకులు, పరుగులు



పెదనాయుడుపాలెంలోని వ్యవసాయ క్షేత్రాల్లో వరి కుప్పలు వేస్తున్న రైతులు



వరి చేను మోస్తున్న రైతులు

సబ్బవరం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని వరి వేసుకున్న రైతులు అప్రమత్తమయ్యారు. పలు గ్రామాల్లో వరికోతలు పూర్తి చేసిన రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. కోతలు పూర్తి చేసిన రైతులు ఎక్కడికక్కడే వరి క్షేత్రాల్లో కుప్పలు వేసుకుంటూ శనివారం హడావుడిగా కనిపించారు. కోతలు కోయాల్సిన రైతులు తుపాను నేపథ్యంలో వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే మండల వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులందరికీ తుపాను ప్రభావంపై అప్రమత్తం చేశారు.

గురుకుల విద్యార్థుల్లో చైతన్యానికి కృషి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ప్రజ్ఞ, స్వాగా ప్రతినిధులు

సీతంపేట: సాంఘిక సంక్షేమ గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం(స్వాగా) ప్రారంభోత్సవ సభ ఈ నెల 9న ఉదయం 10 గంటలకు రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లవరపు కైలాస్ తెలిపారు. కార్యక్రమ బ్రోచర్‌ను గీతం ప్రొఫెసర్ డాక్టర్ సి.ప్రజ్ఞ చేతుల మీదుగా శనివారం అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కైలాస్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరినీ ఒకటిగా చేసి, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాలల విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ప్రతి పేద విద్యార్థి గురుకులాల్లో చేరి చదువుకోవడానికి వేసవి సెలవుల్లో జ్ఞాన యాత్ర చేపట్టి ప్రవేశ పరీక్షకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. గురుకుల సొసైటీకి, ప్రభుత్వానికి వారధిగా పనిచేసి విద్యార్థులను చైతన్యవంతంగా చేయడమే సంఘ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బి.రవికుమార్, కంచి బాల అప్పారావు, పెద్దాడ రాజు, విమల్, చైతన్య, పైల శ్రీను, ఐడి బాబు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

పెందుర్తి: సుజాతనగర్ సమీపంలోని గోపాలకృష్ణ లేఅవుట్‌లో నివాసం ఉంటున్న ఓ మహిళ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నగరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గడుతుల దేవన్న, భార్య జరానతో కలిసి నివాసం ఉంటున్నారు. జరానకు మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడంతో నగరంలోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయితే ఇటీవల మందులు సరిగ్గా వేసుకోకపోవడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. దీంతో కొద్ది రోజులుగా ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఈ క్రమంలో గత నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్ల పంపిణీ చేస్తున్న ప్రసాద్, ఎస్‌బీఐ సిబ్బంది

సబ్బవరం:స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రటరీ ఎల్. చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్బవరం శాఖలో శనివారం ఘనంగా నిర్వహించారు.దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లా రీజినల్ కో సెక్రటరీ పైలా ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ మురళీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



అమర్‌నాథ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమాదేవి

పెందుర్తి: ఇటీవల నగరంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సుజాతనగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థి వి.అమర్‌నాథ్ రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

90 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి: ఏజెన్సీ నుంచి నగరానికి గుట్టుచప్పుడుగా తరలిస్తున్న గంజాయిని పెందుర్తి పోలీసులు చింతలగ్రహారం వంతెన వద్ద పట్టుకున్నారు. వివరాలివి.. ఒడిశాకు చెందిన ప్రమోద్, మరో ఇద్దరు వ్యక్తులు కలిసి విశాఖ-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గంజాయి సేకరించి కారులో నగరానికి తరలిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు చింతలగ్రహారం వంతెన వద్ద మాటుకాసి పట్టుకున్నారు. కారుతో పాటు అందులోని 90 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ప్రమోద్‌ను అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరు పరారయ్యారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతుంది.

17 నుంచి ధనుర్మాసోత్సవాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురం పోర్ట్ క్వార్టర్స్ సమీపంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు గోపాలాచార్యులు తెలిపారు. 17వ తేదీ ఆదివారం పాశుర విన్నపాలతో ధనుస్సంక్రమణం ప్రారంభమవుతుందని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌లో సాధారణ ఉత్పత్తి సాధనకు కృషి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి రెండు, మూడు నెలల్లో సాధారణ స్థితికి చేరేలా కృషి చేస్తున్నామని సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఇందుకు కార్మిక సంఘాలు సహకరించాలని కోరారు. ఉక్కు పరిపాలనా భవనంలో కార్మిక సంఘాలతో సీఎండీ, డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో రాయబరేలి వీల్ ప్లాంట్, హెచ్‌బీ కాలనీలకు సంబంధించి సానుకూల నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆర్థికంగా ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఉత్పత్తికి సంబంధించి సెయిల్, జేఎస్‌పీఎల్‌లతో చర్చలు జరుగుతున్నాయన్నారు. వాటిపై త్వరలో నిర్ణయం వెలువడుతుందన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పెండింగ్ అంశాలను లేవనెత్తారు. దీనిపై కార్మిక సంఘాలు యాజమాన్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్-3 పునరుద్ధరణ, కార్మికులకు వేతన సవరణ తదితర అంశాలపై యాజమాన్యం తీరును విమర్శించారు. చివరకు సమావేశంలో ఎటువంటి సానుకూల నిర్ణయం వెలువడలేదని కార్మిక సంఘాల నాయకులు పెదవి విరిచారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, వరసాల శ్రీనివాసరావు, గణపతిరెడ్డి, పాడి త్రినాథరావు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఫ్లాట్లే టార్గెట్

- బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లోవ్‌లోని ఆరు ఫ్లాట్‌లలో చోరీకి యత్నం
- పరిశీలించిన క్రైం డీసీపీ నాగన్న



బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లేవ్



దొంగలు నిచ్చెన వేసుకుని ఎన్‌క్లేవ్‌లోకి ప్రవేశించిన మార్గం

సింహాచలం: తాళం వేసి ఉన్న ఫ్లాట్లనే టార్గెట్‌గా ఇద్దరు దొంగలు చోరీకి ప్రయత్నించిన సంఘటన శనివారం 98వవార్డు అప్పన్నపాలెంలో సంచలనం రేకెత్తించింది. గేటెడ్ కమ్యూనిటీగా ఉన్న బాలాజీ హిల్‌వ్యూ ఎన్‌క్లోవ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, అసోసియేషన్ సభ్యులు తెలిపిన వివరాలు.. అప్పన్నపాలెంలోని బాలాజీ హిల్ వ్యూ ఎన్‌క్లోవ్‌లో శనివారం తెల్లవారు జామున సుమారు రెండున్నర గంటల సమయంలో ఇద్దరు దొంగలు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజ్‌లు వేసుకుని సీ,డీ బ్లాకుల్లో మొత్తం ఐదు అంతస్తులు తిరిగారు. సీ బ్లాక్‌లో తాళం వేసి ఉన్న రెండు ఫ్లాట్‌లను తెరిచేందుకు పూనుకోగా అవి రాలేదు. ఒక ఫ్లాట్ డోర్ తెరచుకోవడంతో లోపలికి ప్రవేశించారు. అలాగే డీ బ్లాక్‌లోని మూడు ఫ్లాట్‌ల ప్రధాన ద్వారం గడియలు తెరిచి లోపలికి వెళ్లారు. ఇంతలో కార్తీక మాసం పూజలకోసం లేచిన ఒక మహిళ ఎవరని అరవడంతో ఇద్దరూ పరుగులు తీశారు. దొంగలు ప్రధాన ద్వారాలు తెరచి ప్రవేశించిన ఫ్లాట్‌ల్లోని వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నట్టు సమాచారం. అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నాయకులు పెందుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్రైం డీసీపీ నాగన్న, ఏడీసీపీ గంగాధర్, ఏసీపీ సునీల్, పెందుర్తి ఎస్ఐ సల్మాన్‌బేగ్ వచ్చి పరిశీలన చేశారు. సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌లతో పరిశీలన చేశారు. కాగా దొంగలు లోపలికి ప్రవేశించిన నాలుగు ఫ్లాట్‌ల నివాసితులకు అపార్ట్‌మెంట్ వాసులు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత ఏమైనా వస్తువులు పోయాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. కాగా రెండు ఫ్లాట్ల తలుపులు తీసేందుకు దొంగలు ప్రయత్నించారని, ఒక ఫ్లాట్ తలుపు మాత్రమే రావడంతో లోపలకు ప్రవేశించారని పెందుర్తి క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్ చెప్పారు. ఇదిలావుండగా హిల్‌వ్యూకి పక్కన ఉన్న ఖాళీ స్థలం ఉండటంతో ప్రహరీకి నిచ్చెన వేసుకుని దొంగలు ప్రవేశించినట్టు చెబుతున్నారు. కాగా పోలీసులు హిల్‌వ్యూలోకి మీడియాను అనుమతించలేదు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న వెంకటరమణ

పరవాడ: వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని కన్జ్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ అన్నారు. కన్జ్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నాయుడు పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన విద్యార్థులు- వినియోగదారుల రక్షణ చట్టం అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వెంకటరమణ ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. మోసపోయిన వినియోగదారులుహెల్ప్ లైన్ నంబరు 1915 సంప్రదించాలని సూచించారు. లేని పక్షంలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. వినియోగదారుల క్లబ్‌ల ప్రాధాన్యత, హాల్‌మార్క్ బంగారు ఆభరణాల్లో స్వచ్ఛత, తూనికలు, కొలతల్లో మోసాలు, కన్జ్యూమర్స్ వినియోగదారుల రక్షణ చట్టం లక్ష్యాలు, ప్రయోజనాలపై వెంకటరమణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం. పి.వెంకటసురేష్, క్లబ్ అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, ఉపాధ్యాయుడు మళ్ల కోటేశ్వరరావు, ఎస్.శ్రీను, వి.ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సాధారణ ఉత్పత్తి సాధనకు కృషి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి రెండు, మూడు నెలల్లో సాధారణ స్థితికి చేరేలా కృషి చేస్తున్నామని సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఇందుకు కార్మిక సంఘాలు సహకరించాలని కోరారు. ఉక్కు పరిపాలనా భవనంలో కార్మిక సంఘాలతో సీఎండీ, డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో రాయబరేలి వీల్ ప్లాంట్, హెచ్‌బీ కాలనీలకు సంబంధించి సానుకూల నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందన్నారు. తద్వారా ఆర్థికంగా ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఉత్పత్తికి సంబంధించి సెయిల్, జేఎస్‌పీఎల్‌లతో చర్చలు జరుగుతున్నాయన్నారు. వాటిపై త్వరలో నిర్ణయం వెలువడుతుందన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పెండింగ్ అంశాలను లేవనెత్తారు. దీనిపై కార్మిక సంఘాలు యాజమాన్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.మస్తానప్ప, పాడి త్రినాథరావు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.